క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష మోదక హోమం



గుంటూరు ఈస్ట్: సంపత్ నగర్ మెయిన్ రోడ్డులోని హరి సన్నిధి ఆధ్యాత్మిక సేవా సంస్థ ప్రాంగణంలో శుక్రవారం లక్ష మోదక హోమం విశేషంగా నిర్వహించారు. గణపతి మూల మంత్రంతో చతురావృతి క్షీరతర్పణం కన్నుల పండువగా చేశారు. గణపతి మూలమంత్రంతో సహస్ర మోదక హోమం విశేష ద్రవ్యాలతో నిర్వహించారు. వేదోక్తంగా పూర్ణాహుతి గావించారు. చండీ సప్తశతి పారాయణం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నవగ్రహ నక్షత్ర జపాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు కోటా నాగరాజ శర్మ అవధాని మాట్లాడుతూ ప్రతినెలా శుద్ధ చవితినాడు లోక కల్యాణార్థం, వంద నెలల పాటు హోమం నిర్వహిస్తున్నామని చెప్పారు. భక్తులు పాల్గొని గణపతి ఆశీర్వాదం పొందాలని ఆయన కోరారు.

జీడీసీసీ బ్యాంక్‌లో ముగ్గురికి జీఎంలుగా పదోన్నతులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో డెప్యూటీ జనరల్ మేనేజర్లుగా పని చేస్తున్న వి.వి.ఎస్. ఫణికుమార్, సీహెచ్. అజయ్ కిశోర్, కె.మాధవీలకు జనరల్ మేనేజర్లుగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రోసూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో షేక్ గస్ సైదాకు గుమస్తాగా కారుణ్య నియామకం కింద పత్రం అందజేశారు. ఆయన తండ్రి క్రోసూరు పీఏసీఎస్‌లో గుమస్తాగా పని చేస్తూ ఇటీవల మరణించారు. అనంతరం జీఎంలుగా పదోన్నతులు పొందిన ముగ్గురిని బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, బ్యాంక్ సీఈవో టి.కృష్ణవేణి, పాలకవర్గ సభ్యులు, పలువురు బ్యాంక్ అధికారులు ఘనంగా సత్కరించారు.

నిజాయతీ చాటుకున్న ఆటోడ్రైవర్

పట్నంబజారు: ఆటోలో మరిచిపోయిన పర్సును ప్రయాణికుడికి అప్పగించి ఆటో డ్రైవర్ నిజాయతీని చాటుకున్నాడు. లాలాపేట పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి హిమని కూల్‌డ్రింక్ సెంటర్ వద్ద ఆటో ఎక్కి ఆర్టీసీ బస్టాండ్ వద్ద దిగి వెళ్లిపోయాడు. అనంతరం డ్రైవర్ షేక్ జానీ బాషా తన ఆటోలో పర్సు ఉండటం గమనించి అప్పటికప్పుడు బస్టాండ్‌లోకి వెళ్లి వెతకగా, ప్రయాణికుడు కనబడలేదు. తర్వాత దాన్ని లాలాపేట పోలీసులకు అందజేశాడు. అందులో రూ. వెయ్యి నగదు, మూడు ఏటీఎం కార్డులతోపాటు, పలు గుర్తింపు కార్డులు ఉన్నాయి. సదరు వ్యక్తి లాజరస్‌గా గుర్తించి పోలీసులు విషయాన్ని అతడికి తెలియజేశారు. నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్ జానీబాషాను లాలాపేట పోలీసులు అభినందించారు.

వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐగా శ్రీనివాసరావు



పట్నంబజారు: గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐగా కె.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్ ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన చందోలు, బెల్లంకొండ, క్రోసూరు, కొత్తపేట పోలీసు స్టేషన్లతో పాటు పలుచోట్ల పని చేశారు. ఈ ఏడాది ఆయనకు సీఐగా పదోన్నతి లభించింది. గుంటూరు ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగం సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐగా నియమిస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన అక్కేశ్వరరావు మార్టూరు సీఐగా బదిలీపై వెళ్లారు.

రేపు కిడ్నీ వ్యాధుల వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ), మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డయాబెటిక్ నిరోధక మాసం సందర్భంగా ఈనెల 19న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 'కిడ్నీ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం– శాస్త్రీయ అవగాహన సభ ' నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్‌హెచ్‌ఓ బిల్డింగ్‌లో నిర్వహించే వైద్య శిబిరంలో కిడ్నీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కె.రఘురాం పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

రేపు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం ఘంటసాల స్వర నీరాజనం పేరిట 12 గంటల పాటు నిర్విరామ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్వచ్ఛ ఓటర్ల జాబితాకు ఇదే చివరి అవకాశం

- కమిషనర్ కీర్తి చేకూరి
- అర్హుల ఓటు ఒక్కటీ తొలగించడానికి వీల్లేదు
- ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల నిబంధనల మేరకు అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించడానికి వీల్లేదని, తొలగింపు అర్జీలను సూపర్‌వైజరీ అధికారులు, ఏఈఆర్‌ఓలు ప్రత్యక్షంగా పరిశీలన చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించబడదని, అలా ఎక్కడైనా జరిగితే పీపుల్స్ రిప్రజంటేటివ్ యాక్ట్ 1950 ప్రకారం జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. నూతన ఓటు కోసం ఫారం–6ని దాఖలు చేయవచ్చని తెలిపారు. ఓటర్ల ముసాయిదా లిస్టు మేరకు బీఎల్‌ఓల క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిన నాట్ ట్రేస్డ్ ఓటర్లకు ఎన్నికల నిబంధనల మేరకు రిజిస్టర్ పోస్ట్ చేశామని, 15 రోజుల్లో వివరణ రాని పక్షంలో ఓటు తొలగిస్తామని చెప్పారు. స్వచ్ఛ ఓటర్ల లిస్టు తయారీకి ఇదే చివరి అవకాశమని, బీఎల్‌ఓలు మరింత అప్రమత్తంగా ఉంటూ తమ పరిధిలోని ఓటర్ల లిస్టు సరి చేయడానికి కృషి చేయాలని ఆమె ఆదేశించారు. రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి అందిన ఫారాల్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా పరిష్కరించాలని సూచించారు. ఒకే డోర్ నంబర్‌లో పదికి మించి ఓట్లు ఉంటే బీఎల్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులు, ఏఈఆర్‌ఓలు ప్రత్యక్ష పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో చేర్పులు లేదా తొలగింపులు ఐదుకి మించి వస్తే ఏఈఆర్‌ఓలు నేరుగా పరిశీలన చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి, ఏఈఆర్‌ఓలు, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, సూపర్‌వైజరీ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

టెండర్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్క్ అగ్రిమెంట్ పొందిన పనుల్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసినప్పుడే నగర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రీవెన్స్‌లో కాంట్రాక్టర్లు అందించిన అర్జీలు, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, సమస్యలు పరిష్కారం అయ్యాక వారికి తెలియజేయాలని అధికారుల్ని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు.

కార్పొరేటర్ల అర్జీల పరిష్కారంపై నివేదిక

కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తన చాంబర్‌లో శుక్రవారం కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యల్ని వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలపాలని అధికారుల్ని ఆదేశించారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవులు, కవయిత్రులను సత్కరించిన ఝాన్సీలక్ష్మి, సిబ్బంది



గార్డెన్స్ గ్రంథాలయంలో విద్యార్థులతో శకుంతల, సత్య శిరీష



ఎస్వీఎన్ కాలనీ గ్రంథాలయంలో విద్యార్థులతో వెంకాయమ్మ, ఉపాధ్యాయులు



బుక్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ప్రియాంక, శ్రీవిద్యతో భరత్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని గ్రంథాలయాల్లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ వైవిధ్యమైన కార్యక్రమాల్ని నిర్వహిస్తూ, పాఠకులు, విద్యార్థుల్ని ఆకట్టుకుంటున్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లా రచయితల సంఘ కార్యదర్శి ఎస్‌ఎం సుభాని అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, కవయిత్రులు ప్రస్తుతం సమాజంలో నెలకొన్న పరిణామాలపై మాట్లాడారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యత వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, గ్రంథపాలకులు చిన్నపరెడ్డి, ఎన్. నాగిరెడ్డి, దుర్గారెడ్డి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

■ బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.సి.వి.గురవారెడ్డి, జి. శివారెడ్డి, ఎస్. ఈశ్వరి, ఆర్. రత్నకుమారి, పీఈటీ ఎస్. విజయ్, గ్రంథాలయాధికారులు బి. శకుంతల, పి. సత్య శిరీష, సిబ్బంది పి. కోటేశ్వరి, పి. సుధాకర్‌రావు, పాఠకులు పాల్గొన్నారు.

■ ఎస్వీ ఎన్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖన పోటీలతో పాటు కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్మయ విద్యాలయ ఉపాధ్యాయులు అనురాధ, వెంకటేశ్వరరావు, పూజిత, రికార్డు అసిస్టెంట్ బి. వెంకాయమ్మ పాల్గొన్నారు.

■ విద్యార్థుల మేధో వికాసానికి పుస్తక పఠనం దోహదం చేస్తుందని స్టెమ్ స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని స్కూల్లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బుక్ ఫెస్టివల్‌ను ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ చుక్కపల్లి ప్రియాంక, కెనడీ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీవిద్య ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని మేధావులంతా పుస్తక పఠనం ద్వారానే అయ్యారని, వారి జీవితాల ద్వారా స్ఫూర్తిని పొందాలని విద్యార్థులకు సూచించారు. విజ్ఞాన, సాహిత్య పుస్తకాలతో ఈనెల 19వ తేదీ వరకు అందుబాటులో ఉండే పుస్తక ప్రదర్శనను విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో శుక్రవారం ''విద్యార్థులు–పఠనాసక్తి పెంపొందించడం ఎలా'' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పలకు సద్ది ప్రారంభం



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్‌లోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో ఏంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యాన కార్తిక మాస మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాగేంద్ర స్వామికి అభిషేకార్చన, అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో ఆలయం మారుమోగింది. అనంతరం స్వాములకు అన్నప్రసాద వితరణ (సద్ది) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 27 వరకు సద్ది కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమాల్ని అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, సీతారామిరెడ్డి పర్యవేక్షించారు. పూజల్ని అర్చకులు చంద్రశేఖరశర్మ, శివకుమారశర్మ నిర్వహించారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: కేవీపీ కాలనీలోని కేఎస్ఆర్టీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం శంకర నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో రెయిన్‌బో ప్రాజెక్ట్‌లో భాగంగా ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లజోళ్లు అవసరమైన విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ప్రైమరీ హెచ్‌ఎం వై. థామస్‌రెడ్డి, జగదీశ్‌బాబు, ఆస్పత్రి ప్రతినిధి గంగాధర్ పాల్గొన్నారు.

●భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



శ్యామలానగర్ నాగుల పుట్ట వద్ద కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తిక మాసం మొదటి శుక్రవారం, నాగుల చవితి పర్వదినం సందర్భంగా నగరంలోని శివాలయాలు కిటకిటలాడాయి. ఈశ్వరుని దర్శించుకుని అనంతరం భక్తులు శ్రీ నాగేంద్ర స్వామి పుట్టలో పాలు పోసి మొక్కులు తెచ్చుకున్నారు. నగరంలో ప్రసిద్ధిగాంచిన కొత్తపేట శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మొగిలి సతీష్ కుమార్, సభ్యులు, ఈవో తమ్మ శివారెడ్డి పర్యవేక్షించారు.

– పాత గుంటూరు



కొత్తపేట శివాలయంలో బారులుతీరిన భక్తులు



స్వర్ణభారత్ నగర్‌లోని నాగుల పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



అరండల్‌పేట శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



అరండల్‌పేట శివాలయం పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



ఆంజనేయపేట పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



శ్యామలానగర్ పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

ఏఎన్‌యూలో జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భారతదేశ వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక సవాళ్లు, వ్యూహాలు – ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సూచన' అనే అంశంపై ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగాధిపతి, సదస్సు డైరెక్టర్ ఆచార్య కె. మధుబాబు మాట్లాడుతూ సదస్సులో 12 ప్రత్యేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామని చెప్పారు. సదస్సులో ఉత్తరాఖండ్ డూన్ యూనివర్సిటీ డీన్, ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య పి. మంగైన్ కీలకోపన్యాసం చేయనున్నారని, ప్రత్యేక ఆహ్వానితులుగా తుల్జాపూర్ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అధ్యాపకులు ఆచార్య జైన్ హాజరవుతారని తెలిపారు. వ్యవసాయ రంగంలో జన్యుపర విత్తనాల వినియోగం, సుసంపన్న, సూక్ష్మ పోషకాహారం, బిందు, తుంపర సేద్యాలు, వ్యవసాయంపై వాటి ప్రభావం, సంస్థాగత వనకల్పనలు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రభావం, వ్యవసాయ ఉత్తత్తులు, మార్కెటింగ్ రంగాల్లో నూతన సంస్కరణలు, వ్యవసాయ రంగ అనుబంధ ఉత్పత్తుల ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే అంశాలు, రైతు భరోసా కేంద్రాల పాత్ర, ప్రకృతి సేద్యం, చిన్న, సన్నకారు రైతుల ఆత్మహత్యలు, ఆంధ్రప్రదేశ్‌లో మత్స్య పరిశ్రమ తదితర అంశాలపై ఈ సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించవచ్చని ఆయన సూచించారు. వచ్చే ఏడాది జనవరి 25వ తేదీలోగా వాటిని సమర్పించాలని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఎకనామిక్స్ విభాగ హానరరీ అధ్యాపకులు ఆచార్య సీఎస్ఎన్ రాజు, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి చేద్దాం

గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, మిర్చి దిగుమతి, ఎగుమతి వ్యాపారుల అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఖమ్మం మిర్చి యార్డును సందర్శించారు. క్రయ విక్రయాలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాల్ని అధ్యయనం చేశారు. అనంతరం ఖమ్మం మార్కెట్ యార్డు పాలకవర్గం, అధికారులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజనారాయణ మాట్లాడుతూ ఖమ్మం మార్కెట్ యార్డు నుంచి అవసరమైన సాంకేతిక, వనరుల సహకారం తీసుకుంటామన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు నుంచి ఏ సహకారం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. సమన్వయంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రాముఖ్యత కలిగిన ఈ రెండు మిర్చి యార్డులను అభివృద్ధి చేసుకుందామని ఆయన సూచించారు. ఖమ్మం మార్కెట్ యార్డును సందర్శించిన వారిలో మిర్చి దిగుమతి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, మిర్చి ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ సభ్యుడు సాంబశివరావు, ఎగుమతి వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు జుగిరాజ్ భండారి పాల్గొన్నారు.

రోగులకు సత్వరమే వైద్య పరీక్షలు అందించాలి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నుంచి వచ్చే రోగులకు సత్వరమే వైద్యసేవలు అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. శుశ్రుత హాలులో శుక్రవారం ఆసుపత్రి హెచ్‌ఓడీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రతి విభాగం హెచ్‌ఓడీ బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ నాయక్, డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, ఏడీ సుధాకర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు రూ. లక్ష అందజేసిన డాక్టర్ ఝాన్సీ

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ ఝాన్సీ రూ. లక్షను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌కు శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ ఆమెను అభినందించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలన్నారు. డాక్టర్ ఝాన్సీని వైద్యులు, సిబ్బంది అభినందించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా రూ. 85 వేల విలువ గల వైద్య పరికరం అందించడం అభినందనీయమని డాక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

నాణ్యమైన పరిశోధనల దిశగా విద్యార్థులు సాగాలి



సదస్సులో బ్రోచర్స్ ఆవిష్కరిస్తున్న వెంకటరమణ తదితరులు

గుంటూరు రూరల్: నాణ్యమైన పరిశోధనల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ ఎం . వెంకటరమణ తెలిపారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్న క్వాలిటీ బై డిజైన్ ఏ రోడ్ మ్యాప్ ఫర్ క్వాలిటీ ఫార్మాస్యూటికల్స్ ప్రొడక్ట్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఫార్మా రంగంలో ఔషధ అభివృద్ధి, ఉత్పత్తి, సమర్థత ఆవిష్కరణల్ని నిర్ధారించడానికి డిజైన్ ద్వారా నాణ్యత అనేది ముఖ్యమైన ప్రక్రియగా మారిందని తెలిపారు. దీన్నే ఆంగ్ల భాషలో క్యూబిడీగా వ్యవహరిస్తారన్నారు. సాంకేతికత విశ్లేషణాత్మక పద్ధతి, అభివృద్ధి, ఔషధ తయారీ రంగంలో నానో టెక్నాలజీ రంగాలలో వినియోగించే వీలుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మా కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. విలియం క్యారీ మాట్లాడుతూ విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు, ఫార్మా రంగంలో తాజా పోకడలపై జ్ఞానం , అందులో ఎదురయ్యే సవాళ్లను తెలుసుకునే అవకాశం, ఔషధ తయారీ ప్రక్రియలో రూపకల్పన ద్వారా నాణ్యత అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సదస్సులో ఇండోనేషియా, మలేషియా, మాల్దీవ్స్, కొరియా తదితర దేశాలనుంచి 620 మంది హాజరై, 250 మంది పరిశోధన పత్రాల్ని సమర్పించారని తెలిపారు. అనంతరం సదస్సులో పరిశోధన పత్రాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సి.ఎస్. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ యూజీ మూడు, ఐదో సెమిస్టర్ తరగతుల్ని ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ స్టడీ సెంటర్ ప్రాంతీయ సమన్వయకర్త పి. గోపీచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 0863–2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సింగిల్ నంబరు ఆట నిర్వాహకుడి అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు ఆట నిర్వాహకుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నల్లచెరువు 1వ లైను వద్ద వీరయ్య సింగిల్ నంబరు లాటరీ స్లిప్పులు రాస్తూ, ఆట ఆడిస్తున్నట్లు సమాచారం అందుకున్న లాలాపేట పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. రూ. 2వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

పెదకాకాని ఏఎస్ఐ శివశంకర్ సింగ్ మృతి



శివశంకర్‌సింగ్ (ఫైల్)

పెదకాకాని: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న శివశంకర్ సింగ్ (61) శుక్రవారం మృతి చెందారు. 1989లో పోలీసు శాఖలో చేరిన ఆయన గత రెండేళ్లుగా పెదకాకాని పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్నారు. తోటి సిబ్బందితో కలసి గురువారం రాత్రి 10 గంటల సమయంలో కూడా పెదకాకాని ఎస్. కన్వెన్షన్ వద్ద విధుల్లో పాల్గొన్నారు. అనంతరం గుంటూరు తారకరామనగర్‌లోని చిన్న కుమార్తె ఇంటికి చేరిన ఆయన భోజనం అనంతరం నిద్రించారు. అర్ధరాత్రి విపరీతమైన దగ్గు రావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు శివశంకర్ సింగ్ అప్పటికే మరణించినట్లు తెలిపారు.

ఆశ్రమంలో పండ్ల పంపిణీ

గుంటూరు రూరల్: మంత్రి రోజా జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర నూర్ బాషా సంఘం అధ్యక్షుడు కె.పీర్ మహమ్మద్ ఆధ్వర్యంలో అనాథ, వృద్ధాశ్రమాలలో పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు. గోరంట్లలోని గోతాలస్వామి ఆశ్రమంలో 120 మందికి అందజేశారు.

